క్లుప్తంగా

విద్యుత్ శాఖ అధికారుల తనిఖీలు

రేపల్లె: పట్టణంలో విద్యుత్ ఇంటిలిజెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించి పలువురికి పెనాల్టీలు విధించినట్లు ఆ శాఖ డిప్యూటీ ఈఈ సుధాకర్ బాబు తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తెనాలి డివిజన్‌లోని వివిధ మండలాల నుంచి 124 మంది విద్యుత్ ఉద్యోగులు తనిఖీల్లో పాల్గొన్నారని అన్నారు. మొత్తం 6,099 సర్వీస్ తనిఖీ చేసి 50 మంది వినియోగదారులు అధికలోడు వాడుతున్నట్లు గుర్తించామని తెలిపారు. వారికి రూ.3.33 లక్షల అపరాధ రుసుం విధించామన్నారు. ముగ్గురు వినియోదారులు అనాధికారకంగా విద్యుత్ వాడుతున్నట్లు గుర్తించి రూ.30,000 అపరాధ రుసుం విధించామని ఆయన పేర్కొన్నారు.

విద్యుత్తు లైన్లు లేకుండా చూసుకోవాలి

భట్టిప్రోలు: ప్రజలు గృహాలు నిర్మించుకునేటప్పుడు వాటికి ఆనుకుని.. ఇళ్ల పైన ఎటువంటి విద్యుత్తు లైన్లు లేకుండా చూసుకోవాలని భట్టిప్రోలు మండల విద్యుత్ శాఖ ఇన్‌చార్జ్ అసిస్టెంట్ ఇంజినీరు ఎన్.శాంతకుమారి బుధవారం తెలిపారు. విద్యుత్ తీగలు ఉంటే కార్యాలయంలో సంప్రదించి చర్యలు తీసుకున్న తర్వాతనే నిర్మాణాలు చేసుకోవాలని తెలిపారు. రియల్ ఎస్టేట్‌లో స్థలాలు కొనుగోలు చేయదలచిన వారు ఎటువంటి విద్యుత్ లైన్లు లేవని నిర్ధారించుకున్న తరువాతే చర్యలకు ఉపక్రమించాలని పేర్కొన్నారు. విద్యుత్ లైన్లు ఉన్న ఎడల తమను సంప్రదించి అధికారిక నియమాల ప్రకారంగా వాటిని మార్చిన తరువాతే కొనుగోలు చేయాలన్నారు. లేకుంటే ఎటువంటి విద్యుత్ ప్రమాదం సంభవించినా దానికి విద్యుత్ శాఖకు ఎటువంటి సంబంధం లేదని ఆమె పేర్కొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్లకు లైసెన్స్ తప్పనిసరి



చెరుకుపల్లి, బాపట్ల: ట్రాక్టర్ యజమానులు దమ్ము చక్రాలతో రోడ్లపైకి వచ్చే సమయంలో తప్పని సరిగా దమ్ము చక్రాలకు రబ్బరు తొడుగు అమర్చి నడపాలని రవాణాశాఖ వాహన తనిఖీ అధికారులు అంకమ్మరావు, కిషోర్‌బాబులు పేర్కొన్నారు. జిల్లా రవాణాశాఖ అధికారి పరంధామ రెడ్డి ఆదేశాల మేరకు మండల పరిధిలోని గూడవల్లి గ్రామ సమీపంలో బుధవారం వాహన తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా దమ్ము చక్రాలతో వెళుతున్న ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసి అపరాధ రుసుము విధించారు. ప్రతి వాహనదారుడు తప్పని సరిగా లైసెన్స్ కలిగి ఉండాలని.. మైనర్లు వాహనాలు నడిపితే వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు.

జీవన ప్రమాణాలకు చర్యలు తీసుకోవాలి

24న విజయవాడలో కార్పెంటర్స్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

భట్టిప్రోలు: స్వతంత్ర భారతావని పునర్నిర్మాణంలో క్షేత్ర స్థాయిలో పని చేసింది వడ్రంగి కళాకారులేనని ఏపీ కార్పెంటర్స్ (వడ్రంగి) అసోసియేషన్ వేమూరు నియోజకవర్గ అధ్యక్షులు కోడూరు వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన భట్టిప్రోలులో విలేకరులతో మాట్లాడారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా వడ్రంగి వృత్తి దారులకు గుర్తింపు ఉండడం లేదని ఆయన తెలిపారు. సమాజ అవసరాలకు పలు రకాల వస్తువులను వడ్రంగి వృత్తి దారులు తయారు చేస్తుంటే.. వారి సమస్యల పరిష్కారానికి ఒక వ్యవస్థను నిర్మాణం చేయలేకపోవడం శోచనీయమన్నారు. కార్పెంటర్స్ హక్కుల సాధనకు అందరూ కలిసి రావాలని కోరారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఈ నెల 24న విజయవాడలో జరుగుతుందని తెలిపారు. సమావేశానికి వడ్రంగి వృత్తి దారులు తరలి రావాలని కోరారు.

నిలిపిన దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలి



కొల్లూరు: దివ్యాంగుల పింఛన్లు నిలిపే ప్రక్రియ కూటమి ప్రభుత్వానికి తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి, తోకలవారిపాలెం సర్పంచి టి.కృష్ణమోహన్ అన్నారు. బుధవారం కొల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో తోకలవారిపాలెం, ఆవులారిపాలెంకు చెందిన పింఛను నిలిపివేసిన దివ్యాంగులతో కలిసి ఎంపీడీవో కె.నరసింహారావుకు పింఛను పునరుద్ధరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో పింఛన్ల రీ వెరిఫికెషన్ పేరుతో సుమారు 200 మంది వరకు పింఛన్లు నిలిపివేయడం దారుణమని అన్నారు. ప్రభుత్వం స్పందించి అర్హులైన దివ్యాంగుల పింఛన్‌ను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకుడు బొనిగల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో పెరుగుతున్న డెంగీ కేసులు!



గుర్రపుడెక్కతో పూడుకుపోయిన పేటేరు మెయిన్ డ్రెయిను



రేపల్లె పట్టణంలో అధ్వానంగా మురుగు కాలువ

- గుర్రపుడెక్కతో పూడుకుపోయిన డ్రెయిన్లు
- ముందుకు పారని మురుగు
- నగరం మండలంలో డెంగీతో భార్యాభర్తలు మృతి

రేపల్లె: రేపల్లె నియోజకవర్గంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారుతోంది. పట్టణం, పల్లె అనే తేడా లేకుండా పారిశుద్ధ్యం క్షీణించి వ్యాధులు ప్రబలుతున్నాయి. పట్టణంలోని మురుగు కాలువలు, గ్రామాల్లోని డ్రెయిన్లు గుర్రపుడెక్క, తూటికాడతో పూర్తిగా నిండిపోయాయి. దీంతో మురుగు ముందుకు కదలక కాలువలు విష జ్వరాలకు కారణమయ్యే దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. రోజుల తరబడి మురుగు పేరుకుపోవడంతో పారిశుద్ధ్యం క్షీణించి ఆ ప్రాంతం దుర్గంధంగా మారుతోంది. ఫలితంగా దోమలు వృద్ధి చెంది వ్యాధులు వ్యాపింపజేస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

> విష జ్వరాలు పెరుగుతున్నా పారిశుద్ధ్య కార్యక్రమాలు మెరుగుపరచడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు వినబడుతున్నాయి. ఇప్పటికే నియోజకవర్గంలోని నగరం మండలం ఈదుపల్లి గ్రామంలో డెంగీ జ్వరంతో భార్యాభర్తలు మృతిచెందారు. రేపల్లె మండలం పేటరులో రెండు, రేపల్లె పట్టణంలో రెండు డెంగీ కేసులు నమోదయ్యాయి. దీంతో పాటు విష జ్వరాలతో బాధపడుతూ ప్రజలు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు.

నియోజకవర్గంలో నాలుగు డెంగీ కేసులు..

నియోజకవర్గంలో ఇప్పటికే నాలుగు డెంగీ కేసులు నమోదవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పేటేరులో రెండు, రేపల్లె పట్టణంలో రెండు డెంగీ కేసులు నమోదు అయినట్లు అధికారులు వెల్లడించారు. విష జ్వరాలతో ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నా అధికారులు స్పందించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైందని ప్రజలు వాపోతున్నారు. కచ్చా డ్రెయిన్లు లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే నీరు నివాస గృహాల మధ్య రోజుల తరబడి నిల్వ ఉంటుందని ఆవేదన చెందుతున్నారు. రోజుల తరబడి నీరు నిల్వ ఉండడంతో దోమలకు ఆవాస ప్రాంతాలుగా మారుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

దోమల నివారణ చర్యలు ముమ్మరం..



పట్టణంలో దోమల నివారణకు పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరం చేశాం. దోమల వృద్ధిని అరికట్టేందుకు ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. ఇప్పటికే పట్టణంలోని చెరువులలో లార్వాను అంతం చేసేందుకు గంబుషియా చేపలను వదిలాం. మురుగు కాలువలు, ఖాళీ స్థలాల్లోని నీటి నిల్వల్లో దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేయడంతో పాటు మురుగు కాలువల్లో యాంటీ లార్వాల్ ఆయిల్స్ స్ప్రే చేయించాం.

కాకర్ల సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్

రాష్ట్రంలో రైతు వ్యతిరేక పాలన



సమావేశంలో మాట్లాడుతున్న గవిని కృష్ణమూర్తి

బాపట్ల: వ్యవసాయం అంటే దండగ అన్న చంద్రబాబు అదే ధోరణితో రాష్ట్రంలో పాలన కొనసాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ బాపట్ల నియోజకవర్గ అధికారప్రతినిధి గవిని కృష్ణమూర్తి పేర్కొన్నారు. రోజురోజుకూ రైతు వ్యతిరేక విధానాలను రాష్ట్రంలోని రైతులు చవిచూస్తున్నారని ఆయన తెలిపారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కృష్ణమూర్తి మాట్లాడారు. నిన్నటి వరకూ కురిసిన భారీ వర్షాల కారణంగా రైతులు నష్టపోయారని ఆయన వివరించారు. గత ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా రైతులకు నష్టం కలిగితే వెంటనే సర్వేలు నిర్వహించి రైతులకు మేలు చేసేవారని గుర్తుచేశారు. నేడు కూటమి ప్రభుత్వం నష్టపోతున్న రైతుల మోహం కూడా కనీసం చూడడం లేదని మండిపడ్డారు. నష్టపోయిన రైతులను ఆదుకుని, ఎరువులను ఉచితంగా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మరుప్రోలు ఏడుకొండల రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కొక్కిలిగడ్డ చెంచయ్య, ప్రచార విభాగం జిల్లా అధ్యక్షులు వడ్డిముక్కల డేవిడ్, నాయకులు నర్రావుల వెంకట్రావు, బొల్లిమేర నిల్‌కుమార్, జయరామి రెడ్డి, మచ్చా శ్రీనివాసరెడ్డి, కటికల యోహోషువా, జాలిరామి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రత కోసం 'శక్తి యాప్'



కుచ్చెళ్లపాడు పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు



కార్యక్రమంలో కొల్లూరు ఎస్ఐ జానకి అమరవర్ధన్

వేమూరు: మహిళల భద్రత కోసం శక్తి యాప్ దోహదపడుతుందని ఎస్ఐ శ్రీనివాసరరావు తెలిపారు. వేమూరు మండలంలోని కుచెళ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆయన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికలు ప్రమాదంలో ఉన్నప్పుడు శక్తి యాప్ ద్వారా తక్షణమే పోలీసుల సహాయం పొందవచ్చునన్నారు. నిర్భయంగా ఫిర్యాదు, లైంగిక వేధింపులు, బెదిరింపులు లేదా ఇతర అవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే యాప్ ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి చర్యలు

తెనాలి అర్బన్: తెనాలి పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. 35వ వార్డు అక్కల వారి వీధిలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రెయిన్‌లకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రూ.12 లక్షలతో వీటిని నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గొడవర్తి శ్రీసాయి హరేరామ్, డీఈ ఆకుల శ్రీనివాసరావు, ఏఈ ఆంజనేయులు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నప్రసాదం వితరణ

ఆత్మకూరు(మంగళగిరి): మండలంలోని ఆత్మకూరు గ్రామంలో వేంచేసి ఉన్న గంగానమ్మ గుడి జాతర మహోత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాదం స్వీకరించారు.

వ్యభిచార గృహాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

పట్టణ సీఐ రాంబాబు

బాపట్ల టౌన్: పట్టణంలో వ్యభిచార గృహాల నిర్వహణ, వాటికి సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ రాంబాబు తెలిపారు. పట్టణంలో పలు గృహాల్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో ఆయన బుధవారం సిబ్బందితో దాడి చేశారు. దాడిలో నలుగురు యువతులు, ఒక విటుడు, వ్యభిచార గృహాలు నిర్వహిస్తున్న ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణ ఎస్ఐ విజయ్‌కుమార్, మహిళా ఎస్ఐ చంద్రావతి, హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు

సాక్షి ఎఫెక్ట్

వేమూరు: మండలంలో రైతులకు సరిపడా ఎరువులు లేవని 'ఎరువుల కొరత.. తీరేనా వెత' శీర్షికన మంగళవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ బుధవారం స్పందించారు. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ.. మార్కెట్ యార్డు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా యూరియా 430 మెట్రిక్ టన్నులు, డీఏపీ 249 టన్నులు రైతులకు ఇచ్చామని తెలిపారు. వ్యవసాయ సాగు బట్టి ఎరువులు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

దోమల నివారణకు సమష్టిగా కృషి చేయాలి



కొల్లూరు: దోమల నివారణకు అందరూ సహకరించాలని కొల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి వి.కావ్యతేజ తెలిపారు. బుధవారం ప్రపంచ దోమల దినోత్సవాన్ని పునస్కరించుకుని స్థానిక పీహెచ్‌సీ వద్ద అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. దోమల కారణంగా వ్యాపించే వ్యాధులు అధికంగా ఉన్నాయని, వ్యాధులను అరికట్టాలంటే దోమల నివారణ ఒక్కటే మార్గమన్నారు. ప్రతి ఒక్కరూ తమ గృహాల వద్ద ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో విజయలక్ష్మి, పీహెచ్ఎన్ బేబిజాయతి, హెచ్‌వీ.జయలక్ష్మి, సూపర్‌వైజర్ హరిబాబు, హెల్త్ అసిస్టెంట్ కల్యాణ్‌రాజ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

కొల్లూరు: వినాయక ఉత్సవాల నిర్వహణకు అన్ని రకాల అనుమతులు తప్పనిసరిగా తీసుకుని విగ్రహాలను ఏర్పాటు చేయాలని కొల్లూరు ఎస్ఐ జానకి అమరవర్ధన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వినాయక చవితి పండుగ నేపథ్యంలో బహిరంగ ప్రాంతాలలో వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేసే వారు కమిటీగా ఏర్పడాలని సూచించారు. కమిటీ తప్పనిసరిగా ప్రతిమలు ఏర్పాటు చేసే ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిమజ్జనాలలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కమిటీ చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమాల్లో అశ్లీల నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రైతులు కలుపు రాకుండా చూసుకోవాలి



ప్యాపర్రు కార్యక్రమంలో హేమంత్ భరత్‌కుమార్



పెరవలిపాలెంలో మాట్లాడుతున్న మధువాణి



భట్టిప్రోలు కార్యక్రమంలో మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

అమర్తలూరు(వేమూరు): వరి పైరు నాటిన 40 రోజుల వరకూ కలుపు రాకుండా చూసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.హేమంత్ భరత్‌కుమార్ తెలిపారు. అమర్తలూరు మండలం కోరుతాడిపర్రు, ప్యాపర్రు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి నాటిన మూడు లేదా ఐదు రోజుల వ్యవధిలో ప్రిటలాక్లోర్ 500 మి.లీ.. లేదా అక్సాడయార్జిల్ 35 గ్రాములు 20 కిలోల ఇసుకలో కలిపి ఒక ఎకరానికి పొలమంతా సమానంగా చల్లాలని అన్నారు. కలుపు మందు వేసే సమయంలో పొలంలో పలుచుగా నీరు ఉండాలన్నారు.కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వేమూరు: భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు మోతాదులో వేయాలని ప్రధాన శాస్త్రవేత్త పి.మధువాణి తెలిపారు. వేమూరు మండలంలోని పెరవలి, పెరవలిపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆమె పొలాలను క్షేత్ర ప్రదర్శన చేశారు. ఏరువాక బాపట్ల కేంద్రం వ్యవసాయాధికారి బాల మురళీధర్ మాట్లాడుతూ.. వరిలో సమగ్ర సస్య రక్షణ పద్ధతులను పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో రేపల్లె ఏడీఏ లక్ష్మీ, మండల వ్యవసాయాధికారి జి.ప్రేమసాగర్ రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

అందుబాటులో 244.87 టన్నుల ఎరువులు..

భట్టిప్రోలు: ఖరీఫ్ దృష్ట్యా రైతుల అవసరాల మేరకు మండలంలోని ఎరువుల దుకాణాలు, సొసైటీలు, రైతు సేవా కేంద్రాలకు ఎరువుల ఇండెంట్ పెట్టామని మండల వ్యవసాయ శాఖాధికారి బి.బ్రహ్మారెడ్డి బుధవారం తెలిపారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిస్తే రైతులు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. మండలంలో 244.87 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. భట్టిప్రోలు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓలు కె.లక్ష్మి ప్రసన్న, వి.బుష్, టి.అఖిల, వీఏఏ నాగూర్ వలి, రైతులు పాల్గొన్నారు.

దోమల వృద్ధిని అరికట్టాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు

రేపల్లె: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో దోమల వ్యాప్తిని అరికట్టవచ్చునని, తద్వారా దోమల వల్ల సంక్రమించే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు తెలిపారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మున్సిపల్, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్ విద్యార్థినీ, విద్యార్థులతో కలిసి దోమల వల్ల వచ్చే వ్యాధుల గురించి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన సాంబశివరావు మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలలో మురుగు నిల్వ లేకుండా చూడాలని, ప్రతి శుక్రవారం డ్రై డే గా పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు దోమల వల్ల వ్యాపించే వ్యాధులను వివరిస్తూ దోమ తెరలు వాడాలని నినాదాలు చేశారు. అనంతరం పట్టణంలోని ఖాళీ నీటి గుంతలలో ఆయిల్ బాల్స్ వేశారు. కార్యక్రమంలో డాక్టర్లు సముద్రాల రమేష్ , షేక్ నాతిక్, షేక్ షాహిన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, శానిటేషన్ సెక్రటరీలు, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

బెంబేలెత్తిస్తున్న వానరాలు!



భట్టిప్రోలులో వానరాల సంచారం రోజురోజుకూ పెరిగిపోతోంది. వానరాలకు భయపడి ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. చేతుల్లో చిన్న చిన్న పొట్లాలు చూసి.. చిన్నారులు, మహిళలు కనిపించినా వెంటపడి మరీ దాడి చేసి గాయపరుస్తున్నాయి. లంక గ్రామాల్లో ఉండే ఈ వానరాలు ఇటీవల ఇక్కడకు వలసగా వచ్చాయి. వీటి బెడదతో కంటిమీద కునుకు లేకుండాపోతుందని స్థానికులకు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లినా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

– భట్టిప్రోలు

జై భీమ్ నూతన కమిటీ ఏర్పాటు



నూతన కమిటీ సభ్యులతో దేవానంద్

అమర్తలూరు(వేమూరు): రాష్ట్ర ఎరుకల అభివృద్ధి కోసం జై భీమ్ నిరంతరంగా కృషి చేస్తోందని జై భీమ్ వ్యవస్థాపక అధ్యక్షులు కతెవరపు దేవానంద్ తెలిపారు. అమర్తలూరు మండలంలోని పెదపూడి గ్రామంలో బుధవారం కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీని పేరం అరుణ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్టీ సామాజిక వర్గంలోని ఉపకులం ఎరుకల కులం హక్కుల కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తమకు అండగా జై భీమ్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి పెదపూడి ఆనందబాబు, సీపీఐ ఎం.ఎల్.కార్యదర్శి న్యాయవాది రామ్‌దేవ్, ఆరమండ్ల సంజీవరావు, డి.రవి, బి.వెంకటేశ్వర్లు, బి.దుర్గా, తదితరులు పాల్గొన్నారు.

తటాకాలా.. రహదారులా!!

కర్లపాలెం: మండల పరిధిలోని పలు గ్రామాల రహదారులు వర్షం పడితే చాలు కాలువలను తలపిస్తున్నాయి. ముఖ్యంగా యాజలి గ్రామంలోని ఎస్సీ కాలనీ ప్రధాన రహదారి, కర్లపాలెం పంచాయతీ పరిధిలోని శంకరం బావి రహదారి, గణపవరం పంచాయతీ పరిధిలోని తెలగపాలెం, చినపులుగువారిపాలెం రహదారులతో పాటు దుండివారిపాలెం, పెదపులుగువారిపాలెం గ్రామాల రహదారులలో నీరు నిలిచి తటాకాలుగా దర్శనమిస్తున్నాయి. వర్షం నీరు ఎక్కువ రోజులు నిలువ ఉండడంతో అవి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. గ్రామాల్లో గతంలో నిర్మించిన రోడ్లకు ఇరువైపులా నివాస గృహాలు మెరకతోలి నిర్మించుకోవడంతో ప్రస్తుత రహదారులు పల్లంగా మారి వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం లేక మురుగు కుంటలుగా ఏర్పడుతున్నాయి. మురుగు కాలువలు కూడా లేవని.. సమస్యను త్వరగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



కాలువను తలపిస్తున్న యాజలి ఎస్సీ కాలనీ రహదారి



వర్షం నీరు నిలిచిన గణపవరం రోడ్డు